క్లుప్తంగా

జాతీయ చేనేత దినోత్సవానికి రండి



కార్పొరేటర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు

ఎల్‌బీనగర్: జాతీయ దినోత్సవం సందర్భంగా ఆగస్టు 6న ఆటోనగర్ కర్నాటి గార్డెన్స్‌లో నిర్వహించే కార్యక్రమానికి హాజరు కావాలని శనివారం పద్మశాలి సంఘం సభ్యులు బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కటకం నర్సింగ్‌రావు, రంగారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం చేనేత సెల్ కన్వీనర్ రఘురాం నేత, నాయకులు జ్ఞానేశ్వర్, కర్నాటి మాధవి, యాదగిరి పాల్గొన్నారు.

పోగొట్టుకున్న పర్సు ఎన్‌ఆర్‌ఐకి అప్పగింత

- అందులో 15200 సౌదీ రియాల్స్



సయ్యద్ ఖాసిమ్‌కు పర్సు అందజేస్తున్న అనిల్‌కుమార్

మలక్‌పేట: తనకు దొరికిన లక్షల రూపాయల విదేశీ కరెన్సీ నోట్లు ఉన్న పర్సును బాధితుడికి అందజేసి తనలోని నిజాయితీని చాటుకున్నాడో వ్యక్తి. మలక్‌పేట ఠాణా పరిధిలో ఈ ఘటన జరిగింది. వివరాలు... మూసారాంబాగ్ డివిజన్ సలీంనగర్‌కు చెందిన అనిల్‌కుమార్‌కు తన ఇంటి సమీపంలోని స్పీడ్ బ్రేకర్స్ వద్ద పర్సు దొరికింది. అందులో సౌదీ అరేబియా దేశానికి చెందిన 15200 రియాల్స్ (ఇండియన్ కరెన్సీలో రూ.3 లక్షల 20 వేలు) ఉన్నాయి. పర్సులో ఉన్న సెల్ నంబర్‌కు ఫోన్ చేయగా కలువలేదు. దీంతో అనిల్ ఈ విషయాన్ని మలక్‌పేట పోలీసులకు తెలిపాడు. పర్సులో దొరికిన ఆధారాల ప్రకారం బాధితుడు ఎన్‌ఆర్‌ఐ సయ్యద్ ఖాసిమ్‌ను శనివారం పోలీస్‌స్టేషన్‌కు రప్పించారు. వివరాలు నిర్ధారించుకున్న తర్వాత పోలీసుల సమక్షంలో అతనికి పర్సును అందజేశాడు. అనిల్ కుమార్‌ను మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ కనకరాజు, ఎస్సైలు అభినందించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

బడంగ్‌పేట్: మండలంలోని కొత్తగూడ గ్రామంలో రామలింగేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, బాలాపూర్‌కు చెందిన కొలన్ శంకర్‌రెడ్డి విరాళం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు సర్పంచ్ మల్లారెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఎల్లారెడ్డికి రూ. 75 వేల విలువ చేసే చెక్కును శనివారం తన నివాసంలో అందజేశారు.

వీరశైవ లింగాయత్‌లను ఓబీసీలో చేర్చాలి

కాచిగూడ: వీరశైవ లింగాయత్‌లను ఓబీసీ జాబితాలో చేర్చాలని ఆగస్టు 2 న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. వీరశైవ లింగాయత్ సంఘం అధ్యక్షుడు సంఘమేశ్వర్ ఆధ్వర్యంలో 'చలో ఢిల్లీ మహాధర్నా' పోస్టర్‌ను ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 2009లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వీరశైవ లింగ బలిజలను బీసీ జాబితాలో నమోదు చేశారని అప్పటి నుంచి ఉమ్మడి రాష్ట్రంలో వీరశైవ లింగాయత్‌లు రాజకీయం, సామాజిక, ఆర్థికంగా లబ్ధిపొందుతున్నారన్నారు. కేంద్రస్థాయిలో ఓబీసీ జాబితాలో లేనందువల్ల విద్య, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వానికి నేషనల్ బీసీ కమిషన్ నుంచి నివేదిక అందజేసి రెండేళ్ల అవుతున్నా ఇప్పటి వరకు ఓబీసీ జాబితాలో చేర్చే ప్రయత్నం చేయలేదన్నారు. లింగాయత్‌లను ఓబీసీలో చేర్చాలని తాను కూడా పార్లమెంట్‌లో పోరాడుతానని కృష్ణయ్య పేర్కొన్నారు. వీర శైవ లింగాయత్ లింగబలిజ సంఘం అధ్యక్షుడు ఈశ్వరప్ప, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, శెట్టి శివకుమార్, దినేష్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

వరదనీరు తొలగింపు



కాచిగూడ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లపై నిలిచిన నీటిని జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు, బీఆర్‌ఎస్ నేతలు దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, కె.సదానంద్‌లు జీహెచ్‌ఎంసీ సిబ్బందితో తొలగింపజేశారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదేశాల మేరకు శనివారం కాచిగూడ స్టేషన్ రోడ్డు, చెప్పల్ బజార్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై నిలిచిన నీటిని తొలగించినట్లు వారు పేర్కొన్నారు.

ఎస్‌ఎన్‌డీపీ పనులతో ముంపు నుంచి విముక్తి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



అయ్యప్పకాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: అయ్యప్పకాలనీలో ఎస్‌ఎన్‌డీపీ పనులు చేపట్టడంతో కాలనీ వాసులకు వరదనీటి ముంపు నుంచి విముక్తి లభించిందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎవరూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తనతో పాటు అధికారులు, నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని కాలనీ వాసులకు ఆయన హామీ ఇచ్చారు. శనివారం నాగోల్ డివిజన్‌లోని అయ్యప్ప కాలనీలో పర్యటించారు. పక్క కాలనీ నుంచి వచ్చే వరద నీరు డ్రైనేజీల్లో కలవడం వల్ల కాలనీలో మురుగునీరు పారుతోందని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కాలనీలో విద్యుత్ వైర్లు కూడా కిందికి వేలాడుతున్నాయన్నారు. సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, కొన్నేళ్ల క్రితం ఈ కాలనీలో వేసిన డ్రైనేజీ పైప్‌లైన్ల సామర్థ్యం ప్రస్తుతం జనాభాకు అనుగుణంగా లేకపోవడంతో మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు పొంగుతోందన్నారు. పాత డ్రైనేజీల స్థానంలో నూతన డ్రెయిన్లు నిర్మిస్తామన్నారు. వరదనీటి ప్రభావం వల్ల కొన్ని ఇళ్లలోకి నీరు వచ్చిందని, నూతన డ్రెయిన్ల నిర్మాణం వల్ల ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు ఉండవని హామీ ఇచ్చారు. నూతన డ్రెయిన్స్ నిర్మాణంలో ఎత్తుపల్లాలు సరిగ్గా చూసుకొని పనులు ప్రారంభించాలని, గతంలో చిన్నపాటి వర్షానికి ఈ కాలనీ మునిగిపోయేదని, ఎస్‌ఎన్‌డీపీ పనులు చేయడం వల్ల కాలనీ వాసులకు వరదనీటి ముంపు నుంచి విముక్తి లభించిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, సతీష్, రమేష్, నర్సింహాచారి, గౌరి, వెంకట్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెడిపోయిన రోడ్లు, డ్రైనేజీలకు తక్షణమే అధికారులు మరమ్మతులు చేపట్టాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ కోరారు. శనివారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని సాగర్‌ఎన్‌క్లేవ్ కాలనీలో అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యటిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న బాక్స్ డ్రెయిన్ పనులను సత్వరమే పూర్తి చేసి ఉంటే ముంపు సమస్య వచ్చి ఉండేది కాదని, వెంటనే అధికారులు పనులను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈఈ కోటేశ్వరరావు, డీఈ కనకయ్య, ఏఈ హేమూనాయక్, కాలనీ ప్రతినిధులు ఈదులకంటి సత్యనారాయణరెడ్డి, మమత, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, రాజు పాల్గొన్నారు.

పార్కులోని మొక్కలను తొలగించిన వారిపై కేసు నమోదు



టీచర్స్ కాలనీలోని పార్కులో మొక్కలను తొలగించిన దృశ్యం

హస్తినాపురం: పార్కులోని మొక్కలను జేసీబీలతో తొలగించిన వ్యక్తులపై వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని పంచాయతీరాజ్ టీచర్స్ కాలనీలోని పార్కులోకి శనివారం ఉదయం కొంత మంది జేసీబీలతో అక్రమంగా ప్రవేశించి చెట్లను తొలగించారని కాలనీకి చెందిన సెంటర్ ఫర్ సోషియో కల్చర్ అండ్ ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ సీఈఓ సన్నీ హెరాక్లియస్ ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీడీఎఫ్ నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలి: సామ



కాలనీవాసులకు కేంద్ర పథకాలను వివరిస్తున్న సామ రంగారెడ్డి

లింగోజిగూడ: బీఆర్‌ఎస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలతో పాలన చేస్తున్నదని రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన లింగోజిగూడ డివిజన్‌లోని ఎస్‌బీహెచ్ కాలనీ, కాకతీయనగర్‌ల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటించారు. కాలనీలవాసులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ, లింగోజిగూడలో 20 ఏళ్ల క్రితం వేసిన పైప్‌లైన్ల కారణంగా సమస్యలు వస్తున్న పట్టించుకోవడం లేదని, ఎండాకాలంలో చేపట్టాల్సి పూడికతీత పనులను అధికారులు వర్షకాలంలో చేయిస్తున్నారన్నారు. లింగోజిగూడ నగరంలోనే అత్యంత ముంపు ప్రాంతం, చిన్నపాటి వర్షాలకే ప్రజలు ఇబ్బంది పడతారని తెలిసి కూడా ముందస్తు చర్యలు తీసుకోకుండా అలసత్వం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి మంజూరైన సీడీఎఫ్ నిధులపై ఎమ్మెల్యే శ్వేత పత్రం విడుదల చేయాలని రంగారెడ్డి డిమాండ్ చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విజయ్ భాస్కర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, శ్రీనివాస్, రాకేష్‌యాదవ్, కృష్ణగౌడ్, కృష్ణం రాజు, హరిప్రసాద్, వీరేశంగుప్తా, మల్కాజిగిరి నాగరాజు, భాస్కర్‌రావు, రాజ్ విలక్షణ్, ప్రశాంతి పాల్గొన్నారు.

పనులు ప్రారంభించకపోతే జలమండలిని ముట్టడిస్తాం



జలమండలి అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: భరత్‌నగర్ కాలనీలో డ్రైనేజీ పనులను వారం రోజుల్లో ప్రారంభించకపోతే బస్తీవాసులతో కలిసి జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ జలమండలి అధికారులను హెచ్చరించారు. శనివారం కొత్తపేట డివిజన్ భరత్‌నగర్ కాలనీ ఫేస్–2 రోడ్ నంబర్ 1లో పర్యటించారు. రెండేళ్లుగా ప్రతి రోజూ డ్రైనేజీ నీళ్లు రోడ్లపై పొంగుతుండటంతో కాలనీ ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆరు నెలల క్రితం జలమండలి అధికారులు సీజీఎం సుజాతతో కలిసి పర్యటించారని, అయినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీంతో జలమండలి ఎండీ దానం కిషోర్‌కు ఎన్నోసార్లు వినతి పత్రాలు అందజేయగా, ఆయన నూతన డ్రైనేజీ లైన్ కోసం రూ.51 లక్షలు మంజూరు చేయించామన్నారు. టెండ్ ప్రక్రియ పూర్తై నెలలు గడుస్తున్నా ఇంకా పనులు ప్రారంభించదన్నారు. వారం రోజుల్లో డ్రైనేజీ పనులు ప్రారంభించకపోతే బస్తీ ప్రజలతో కలిసి జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలియజేశారు, కార్యక్రమంలో బస్తీ వాసులు బాలు, కొమరయ్య, రాజు, మల్లేష్, ఐలయ్య, మధు, వినోద్ పాల్గొన్నారు.

సోయం బాపురావు ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

- కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ వైస్ చైర్మన్ గాంధీనాయక్
- ఎంపీపై ఎల్బీనగర్ ఠాణాలో ఫిర్యాదు



ఎంపీ బాపురావుపై ఫిర్యాదు చేసేందుకు ఎల్‌బీనగర్ ఠాణాకు వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ నాయకులు

మన్సూరాబాద్: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ సోయం బాపురావు ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్టీసెల్ వైస్ చైర్మన్ గాంధీనాయక్, రాష్ట్ర కార్యదర్శి చందునాయక్‌లు డిమాండ్ చేశారు. ఎంపీ సోయం బాపురావు వ్యాఖ్యలను నిరసిస్తూ ఎల్‌బీనగర్‌లోని డా. బీఆర్ అంబేడ్కర్, బాబూజగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు అనంతరం ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఎంపీపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, లంబాడీలను ఎస్టీ జాబితాలో నుంచి తొలగించాలని ఎంపీ సోయం బాపురావు సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడంతో పాటు కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షాతో చర్చలు జరపడాన్ని తీవ్రంగా ఖండించారు. ఎస్టీలో చీలికలు తేవడానికి ఎంపీ ప్రయత్నిస్తున్నారని, లంబాడీలందరూ ఐక్యంగా ఉండి పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎంపీ వ్యాఖ్యలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఎస్టీసెల్ ఇన్‌చార్జి రమేష్‌నాయక్, దీప్‌లాల్‌నాయక్, బాలు నాయక్, తిరుపతినాయక్, లక్ష్మానాయక్ పాల్గొన్నారు.

అసంపూర్తి పనులను పూర్తి చేయాలి

దిల్‌సుఖ్‌నగర్: వర్షాలకు డివిజన్‌లోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, వ్యాధులు ప్రబలకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ ఎ. రాధా ధీరజ్‌రెడ్డి అన్నారు. శనివారం ఆర్‌కేపురంలో డివిజన్‌లోని ఎన్‌టీఆర్‌నగర్, మార్గదర్శికాలనీ తదితర కాలనీల్లో అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. కాలనీల్లో ఎక్కడా డ్రైనేజీలు పొంగకుండా చర్యలు తీసుకోవాలని, కాలనీలలో చెత్త, బురద లేకుండా చూడాలని అధికారులను కోరారు. కాలనీలలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కాలనీల సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా 93, వంకాయ 35, బెండ 55, పచ్చిమిర్చి 75, కాకర 45, బీర 45, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 18, క్యారెట్ 45. దొండ 18, ఆలు 21, ఉల్లి 24, గోకర 28, దోస 23, సొర 15, పొట్ల 18, అరటి 11, చిక్కుడు 70, అర్వి 41, మునగ 35, చిలగడదుంప 45, బీట్‌రూట్ 35, కీర 13, ఫ్రెంచ్ బీన్స్ 85, కాప్సికమ్ 80. ఈ ధరలు ఆదివారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నాణ్యత ప్రమాణాలు పాటించండి

- మేయర్ పారిజాత



మేయర్, కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న కాలనీ వాసులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 23వ డివిజన్ ద్వారక హిల్స్ కాలనీలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్, 29వ డివిజన్ గాంధీనగర్‌లో మహిళా భవన్ నిర్మాణ పనులను శనివారం మేయర్ పారిజాత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భవన నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్లను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ముఖ్యంగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మేయర్ పారిజాత, కార్పొరేటర్ సంతోషిని కాలనీ మహిళలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ శ్రీనివాస్‌రెడ్డి, కాలనీవాసులు పురందేశ్వర్, సునీల్ పాల్గొన్నారు.

నేడు విశ్వబ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదిక

చైతన్యపురి: విశ్వకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైతన్యపురిలోని భాగ్యనగర్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం విశ్వబ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తామని సంస్థ ప్రతినిధి అడ్లూరి రవీంద్రాచారి తెలిపారు. ఈ కార్యక్రమ పోస్టర్‌ను శనివారం ఫంక్షన్‌హాల్‌లో ఆవిష్కరించారు. వివాహ పరిచయ వేదికకు తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. విశ్వబ్రాహ్మణ కులస్తులు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చెన్నూరి అశోక్, గోవర్ధన్, నాగరాజు, రామాచారి, వీరశేఖర్, సంకోజు రాఘవేందర్ పాల్గొన్నారు.

విజయపురి కాలనీ సీనియర్ సిటిజన్స్ కార్యవర్గం ఎన్నిక

ఎల్‌బీనగర్: బీఎన్ రెడ్డినగర్ డివిజన్‌లోని విజయపురి కాలనీ ఫేజ్–1 సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం నూతన కమిటీని శనివారం కాలనీలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడిగా మాణిక్యప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా విజయప్రసాద్, సంయుక్త కార్యదర్శిలుగా లక్ష్మణ్‌రావు, ప్రసాద్‌రావు, కోశాధికారిగా రమణయ్యను ఎన్నుకున్నారు.



నూతన కార్యవర్గ సభ్యులు

18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌హెచ్‌పీఎస్ చైర్మన్ కేశవులు

సైదాబాద్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని సమాచార హక్కు పరిరక్షణ సమితి జాతీయ చైర్మన్ బొమ్మరబోయిన కేశవులు కోరారు. శనివారం సైదాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, ఓటరుగా నమోదు కావడం, ఓటుహక్కు వినియోగించుకోవడం అందరూ బాధ్యతగా గుర్తించాలన్నారు. తమ సంస్థ అనుబంధంగా ఏర్పాటు చేసిన ఎలక్షన్ వాచ్ కమిటీ విరివిగా ఓటరు చైతన్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. గ్రామాల్లో ఓటింగ్ శాతం పెరగటానికి తమ ఎలక్షన్ వాచ్ కమిటీ కృషి చేస్తున్నదని తెలిపారు. తెలంగాణలో రానున్న ఎన్నికల్లో కూడా ఓటరు చైతన్యానికి తమ సంస్థ ప్రతినిధులు కృషి చేస్తారని ఆయన తెలిపారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో కేంద్రీయ విశ్వవిద్యాలయంలో 38 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసి పదవీ విరమణ పొందిన కన్నప్ప అనురాధ, ఎస్‌హెచ్‌పీఎస్ హైదరాబాద్ కన్వీనర్ కె.శ్రీనివాస్‌లను వారు సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కె.ఉషారాణి, గాదం యాదగిరి, చింతపల్లి సదాలక్ష్మి పాల్గొన్నారు.

అర్హులందరికీ దళితబంధు మంజూరు చేయాలి: బీజేపీ



విలేకరులతో మాట్లాడుతున్న లింగాల హరిగౌడ్

సైదాబాద్: మలక్‌పేట నియోజకవర్గ పరిధిలోని అర్హులైన దళితులందరికీ ప్రభుత్వం దళితబంధు మంజూరు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సైదాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దళితబంధు మెదటి విడత మంజూరు చేసిన సమయంలో కేవలం మలక్‌పేట ఎమ్మెల్యే అనుచరులు, ఎంఐఎం నేతలు సిఫారసు చేసిన వారికే మాత్రమే లబ్ధి చేకూరిందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ పథకాలను రాజకీయాలకు అతీతంగా అర్హులకు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు వ్యవహరించాలని ఆయన అన్నారు. రాజకీయాలను ఎన్నికలకు మాత్రమే పరిమితం చేయాలని, లబ్ధిదారుల ఎంపికలో పక్షపాతంగా వ్యవహరిస్తే సహించబోమన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు ఫణిగౌడ్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



పాల్గొన్న కార్పొరేటర్ శ్వేతామధుకర్‌రెడ్డి, వైఎస్‌ఆర్ మూర్తి

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలోని ఆలయంలో వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వైఎస్‌ఆర్ మూర్తి ఆధ్వర్యంలో సుప్రభాతసేవతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం అఖండ దీపారాధన, వేదపారాయణం, రంగారావు, ప్రసాదరావు, హోమం నిర్వహించారు. శ్రీవారి కల్యాణానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ ప్రతినిధులు సుబ్రహ్మణ్య శాస్త్రి, వేదుల కనకదుర్గా పాల్గొన్నారు.

అంతర్గత రోడ్లు అందంగా తీర్చిదిద్దడానికి చర్యలు



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: అంతర్గత రోడ్లను అందంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నామని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని దిల్‌సుఖ్‌నగర్ శశికిరణ్ ఆసుపత్రి నుంచి బాప్టిస్ట్ చర్చి వరకు నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆమె శనివారం ప్రారంభించారు. అనంతరం శాలివాహన నగర్‌లో కొనసాగుతున్న నాలా నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్‌ను అభివృద్ధి చేయడంలో రాజీపడే ప్రసక్తి లేదన్నారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సకాలంలో పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది సత్తిరెడ్డి, ఎస్‌ఎఫ్‌ఏ శ్రీనివాస్, బీజేపీనాయకులు ప్రవీణ్‌యాదవ్, సందీప్‌రెడ్డి, దినేష్, మల్లేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

మన్సూరాబాద్: త్యాగానికి ప్రతీక అయిన మొహర్రం సంతాప దినాలను మన్సూరాబాద్‌లో గత వారం రోజులుగా నిర్వహిస్తున్నారు. శనివారం చివరి రోజు మన్సూరాబాద్ చౌరస్తాలోని అషుర్‌ఖానా షహజాదే ఖాసీం పీర్ల కొట్టం నుంచి మన్సూరాబాద్ ఓల్డ్ విలేజ్, వీకర్‌సెక్షన్ కాలనీలో పీర్లను ఊరేగించారు. ముంజావర్ ఖాజా, సయ్యద్ పాషా, సయ్యద్ అన్వర్, సయ్యద్ మున్నాల నేతృత్వంలో తెల్లవారుజామున ప్రారంభమైన ఊరేగింపులో గ్రామ పెద్దలు, వివిధ కాలనీలవాసులు హాజరై పీర్లకు దట్టీలు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని భూపేశ్‌గుప్తానగర్‌లో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నారగోని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో మొహర్రంను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శ్రీనివాస్ యాదవ్‌కు శాలువా కప్పి సత్కరించారు.



మన్సూరాబాద్‌లో పీర్ల ఊరేగింపు



శ్రీనివాస్‌యాదవ్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

చదువుతోనే సమాజంలో గుర్తింపు



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో వకుళాభరణం కృష్ణమోహన్ రావు తదితరులు

మలక్‌పేట: చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు, పేరు ప్రఖ్యాతులు వస్తాయని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు అన్నారు. తెలంగాణ వీరభద్రీయ (వీరముష్టి) కేంద్ర సంఘం ఆధ్వర్యంలో శనివారం మూసారంబాగ్ కార్యాలయంలో నిర్వహించిన విద్య ప్రతిభ పురస్కారం–2023 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, బీటెక్, ఎంబీబీఎస్ కోర్సుల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు జ్ఞాపిక, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, వాటి ద్వారా లబ్ధిపొందుతూ అభివృద్ధిలోకి రావాలని సూచించారు. విద్యా కమిటీ చైర్మన్ కె.విఠల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ అధ్యక్షుడు కాటపల్లి వీరస్వామి, జాతీయ కమిటీ అధ్యక్షుడు రాజేశ్వర్ రావు, సమన్వయకర్తలు సీహెచ్ కొండయ్య, ఎం. పోచయ్య, నాగప్రమీల, తదితరులు పాల్గొన్నారు.